సాక్షి
అన్నమయ్య జిల్లా

ఆదివారం । 31 । ఆగస్టు । 2025



వ్యాపారుల సిండికేటు.. రైతులకు చేటు

ఉత్తర భారతదేశానికి చెందిన సేట్లు సిండికేట్ కావడంతో ఉద్యాన పంటలకు పేరుగాంచిన రైల్వేకోడూరు ప్రాంతం రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

-8లో



అన్నదమ్ములపై హత్యాయత్నం

ఆస్తి తగాదాల కారణంగా వ్యక్తిగత కక్షలతో అన్నదమ్ములపై ప్రత్యర్థులు హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శనివారం ములకలచెరువు మండలంలో జరిగింది.

-8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.200	రూ.250
రెండోరకం	రూ.140	రూ.190



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 113 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
సీబీ	650	650
బైవోల్టిన్	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 110.580 కిలోలు

న్యూస్‌రీల్

పబ్లిక్ గ్రీవెన్స్ రద్దు

రాయచోటి: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న పబ్లిక్ గ్రీవెన్సును రద్దు చేసినట్లు ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు తెలిపారు. రాజంపేటలో సీఎం పర్యటన నేపథ్యంలో గ్రీవెన్సెల్‌ను తాత్కాలికంగా రద్దు చేసినట్లు ఆదివారం ఎస్పీ ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు సుదూర ప్రాంతాల నుంచి వ్యయ, ప్రయాసాలతో జిల్లా పోలీసు కార్యాలయంలోని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి రావొద్దని పేర్కొన్నారు.

ఉచిత జర్మన్ నర్సింగ్ ట్రైనింగ్‌కు ఆహ్వానం

రాయచోటి జగదాంబసెంటర్: జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంఘం లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో జర్మన్ నర్సింగ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను ఉచితంగా నిర్వహించనున్నట్లు చైర్మన్ జి.రాజ్యలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు షెడ్యూల్డ్ కులానికి చెందిన వారై నర్సింగ్ డిగ్రీ కలిగి ఉండాలని పేర్కొన్నారు. వయసు 20 నుంచి 35 ఏళ్లలోపు ఉండాలని తెలిపారు. జిల్లాలో ఐదుగురు పురుషులు, ఐదుగురు మహిళలను ఎంపిక చేయనున్నారని ఎంపికైన అభ్యర్థులకు 8 నుంచి 10 నెలల పాటు తిరుపతిలో శిక్షణ ఉంటుందని తెలిపారు. సెప్టెంబర్ 4వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

గరుడవాహనంపై శ్రీరంగనాథుడు



గరుడ వాహనంపై సతీసమేత శ్రీరంగనాథస్వామి

పులివెందుల టౌన్: పులివెందుల మున్సిపాలిటీలోని శ్రీరంగనాథస్వామి ఆలయంలో నూలు పూజ పవిత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మూడో రోజైన శనివారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథస్వామి గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో అర్చకులు కృష్ణరాజేష్‌శర్మ ఉభయదారులచే పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ ఉత్సవాలను ఆలయ చైర్మన్ సు. దీకర్‌రెడ్డి, ఈఓ. కేవీ రమణ పర్యవేక్షించారు.

టెలికాం ఉద్యోగుల సంఘం ఎన్నికలు ఏకగ్రీవం



ఏకగ్రీవంగా ఎన్నికైన టెలికాం ఉద్యోగుల సహకార గృహ నిర్మాణ సంఘం నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కడప టెలికాం ఉద్యోగుల సహకార గృహ నిర్మాణ సంఘం లిమిటెడ్ రిజిస్టర్ నంబర్ 1415 కడప వైఎస్సార్ కడప జిల్లా ఎన్నికలు ఏకగ్రీవం అయినట్లు ఎన్నికల అధికారులు సుబ్రహ్మణ్యం, మురళి పేర్కొన్నారు. శనివారం నగరంలోని బీఎస్‌ఎన్‌ఎల్ జీఎం కార్యాలయంలో ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధ్యక్షులుగా కళ్యా సుధాకర్, ఉపాధ్యక్షులుగా ఆకుల సుబ్బారావు, కార్యదర్శిగా ఎం.సి.సుబ్బారెడ్డి, సభ్యులుగా ఎ.వెంకటేశ్వర్లు, బి.నాగరాజు, ఎం.రఘురామయ్య, వి.వెంకట రమణయ్య ఎన్నికయ్యారని తెలిపారు. ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ఉద్యోగుల ఇంటి స్థలాల పరిరక్షణకు కృషి చేస్తామని చెప్పారు. సొసైటీ తరఫున ఉద్యోగులకు, పెన్షనర్లకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు.

యూరియా.. ఏదయా?



జెడ్పీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ రామగోవిందరెడ్డి. వేదికపై కలెక్టర్, జెడ్పీ సీఈఓ, ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి

- ఆర్‌బీకేల్లో రైతులకు సరిపడా ఎరువులు ఉండాలి
- దుకాణాల్లో అధిక ధరకు విక్రయం
- పట్టించుకోని ప్రభుత్వం
- జెడ్పీ సమావేశంలో సభ్యుల ధ్వజం

కడప సెవెన్‌రోడ్స్: ఖరీఫ్ పంటలకు అవసరమైన యూరియా నిల్వలు ఉన్నాయని, ఎలాంటి కొరత లేదంటూ తరుచూ చెబుతున్న ప్రభుత్వం రైతులు అడుగుతున్నా ఎందుకు ఇవ్వడం లేదని పలువురు ప్రజాప్రతినిధులు ధ్వజమెత్తారు. జిల్లా పరిషత్ చైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డి అధ్యక్షతన శనివారం నిర్వహించిన జెడ్పీ సర్వసభ్య సమావేశంలో యూరియా ప్రస్తావన వచ్చింది. జెడ్పీ చైర్మన్ రామగోవిందరెడ్డి మాట్లాడుతూ ఎకరాకు ప్రభుత్వం అందిస్తున్న 100 కిలోల సబ్సిడీ యూరియా ఏమాత్రం సరిపోదని, ప్రతి ఎకరాకు 150–200 కిలోల చొప్పున రైతులకు సరఫరా చేయాలని కోరారు. పంటలు సాగు చేసిన నెల తర్వాత యూరియా వేస్తారని, ఇప్పుడే ఇంత కొరత ఉంటే, వేయాల్సిన సమయంలో మరింత కొరత తలెత్తుతుందని తెలిపారు. రైతు సేవా కేంద్రాల ద్వారా బస్తా రూ. 266 చొప్పున అందిస్తామని ప్రభుత్వం చెబుతోందని, అయితే సరఫరా లేకపోవడం వల్ల రైతులు బస్తా రూ. 400 చొప్పున బయటి మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సిన దుస్థితి తలెత్తిందని ఆవేదన వ్యక్తం చేశారు. చక్రాయపేట జెడ్పీటీసీ శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ పాపాఘ్ని నది పరీవాహక ప్రాంతంలోని గ్రామాల రైతులు సుమారు రెండు వేల ఎకరాల్లో వరి పంట సాగు చేశారని పేర్కొన్నారు. తమకు ఇంకా 70 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని తెలిపారు. తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నందున తమ మండలాన్ని కరువు కింద ప్రకటించాలని కోరారు. వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్ రెడ్డి మాట్లాడుతూ రివర్ బెల్ట్‌లో రైతులంతా వరి సాగు చేసినందు వల్ల యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రిక్వైర్‌మెంట్ ఉన్న రైతు సేవా కేంద్రాలకు యూరియా సరఫరా చేయాలని చెన్నూరు ఎంపీపీ సురేష్‌యాదవ్ కోరారు. డీసీఎంఎస్ శాఖల ద్వారా యూరియా సరఫరాకు ఏర్పాట్లు చేయాలని ఆ శాఖ చైర్మన్ కోరారు. గతంలో డీసీఎంఎస్ శాఖలకు ఎరువులు ఇవ్వలేదని, అవి సిక్ అయ్యాయంటూ జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ వ్యాఖ్యానించారు. ఇందుకు వీఎన్ పల్లె ఎంపీపీ రఘునాథరెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. జిల్లా అధికారిగా ఉంటూ రాజకీయాలు మాట్లాడుతావా? అంటూ ధ్వజమెత్తారు.

- రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయాధికారులు గ్రామాల్లో పర్యటించడం లేదని ఆరోపించారు. రైతు సేవా కేంద్రాల్లో యూరియాతోపాటు ఇతర ఎరువుల నిల్వలు ఎన్ని ఉన్నాయో కూడా చూడడం లేదని చెప్పారు. ఇప్పటికైనా డిమాండ్‌ను అనుసరించి యూరియా సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.



వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి



వీఎన్ పల్లె ఎంపీపీ రఘునాథరెడ్డి

- ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రాలు, సచివాలయ వ్యవస్థలు ఏర్పాటయ్యాయని తెలిపారు. ఇండెంట్ పెట్టిన వెంటనే రైతులకు అవసరమైన యూరియా, ఇతర ఎరువులు, విత్తనాలు అందుబాటులోకి వచ్చేవని తెలిపారు. ఇప్పుడు జిల్లాలో యూరియా డిమాండ్ ఎంత ఉందనే వివరాలు సైతం అధికారుల వద్ద లేదని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేశారనే కక్షతో కాకుండా ఆర్బీకేలు, సచివాలయాలను ఉపయోగించుకుని రైతుల అవసరాలు తీర్చాలని హితవు పలికారు. కేసీ కెనాల్ ఆయకట్టు కింద వరి సాగు చేసిన రైతులకు తగినంత యూరియా సరఫరా చేయాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులురెడ్డి కోరారు. కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి బదులిస్తూ జిల్లాలో సరిపడ యూరియా నిల్వలు ఉన్నాయని, రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. జిల్లాలో 40 శాతం నాట్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు. మరో 10–15 రోజుల్లో జిల్లాకు అదనంగా 26 వేల మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందని వెల్లడించారు.
- ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మాట్లాడుతూ ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న నీరు వృథాగా వెళ్లిపోకుండా చెరువులు, రిజర్వాయర్లు నింపాలన్నారు. ఇందుకు కలెక్టర్ బదులిస్తూ ఈయేడు ముందే జిల్లాకు సాగునీరు అందుబాటులోకి వచ్చిందన్నారు. జిల్లాలోని రిజర్వాయర్ల సామర్థ్యం 83 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 56 టీఎంసీల నిల్వ ఉందన్నారు. వరుస క్రమంలో రిజర్వాయర్లు నింపుతామన్నారు. చెరువులకు మరమ్మత్తులు చేయిస్తామన్నారు. ఒంటిమిట్ట చెరువును నింపేందుకు పైప్‌లైన్ కోసం ప్రభుత్వం రూ. 8 కోట్లు మంజూరు చేసిందని వెల్లడించారు.

సభ్యుల ప్రమాణం

కొత్తగా ఎన్నికైన పులివెందుల జెడ్పీటీసీ మారెడ్డి లతారెడ్డి, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ముద్దుకృష్ణారెడ్డిలతో జెడ్పీ సీఈఓ ఓబులమ్మ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు ఆదినారాయణ రెడ్డి, పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, మార్కెటింగ్ చైర్మన్ జయప్రకాశ్ నారాయణబాబు, ఖాదీ గ్రామీణ బోర్డు చైర్మన్ కేకే చౌదరి, జెడ్పీ సీఈఓ ఓబులమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెన్షన్ల తొలగింపులో టార్గెట్లా? — ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి

వికలాంగుల పెన్షన్లను ఇష్టమొచ్చినట్లు తొలగిస్తున్నారని, ఈ అంశంలో ప్రభుత్వం అధికారులకు టార్గెట్లు విధించిందా? అంటూ ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి ప్రశ్నించారు. బోగస్ పెన్షన్లను తొలగిస్తే అభ్యంతరం లేదని, కానీ ఆ పేరుతో అర్హులవి కూడా తొలగించడం తగదన్నారు. జెడ్పీ చైర్మన్ రామగోవిందరెడ్డి మాట్లాడుతూ బోగస్ పెన్షన్లు తొలగిస్తామంటున్న ప్రభుత్వం సర్టిఫికెట్లు జారీ చేసిన వైద్యులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదంటూ ప్రశ్నించారు. సర్టిఫికెట్లు ఇచ్చేందుకు రూ. 30 వేలు డిమాండ్ చేస్తున్నారని వేంపల్లె జెడ్పీటీసీ అన్నారు. కలెక్టర్ బదులిస్తూ రీ వెరిఫికేషన్ ద్వారా బోగస్, అర్హత లేని 8,223 మందిని గుర్తించామని పేర్కొన్నారు. వీరిలో 7034 మంది అప్పీలు చేసుకున్నారని, వీరికి విచారణ పూర్తయ్యేవరకు పెన్షన్ పంపిణీ చేస్తామన్నారు. పోరుమామిళ్ల జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్ అడిగిన ఓ ప్రశ్నకు కలెక్టర్ బదులిస్తూ రీ సర్వేలో దొర్లిన తప్పుల కారణంగా జిల్లాలో 25 వేల రైతుల ఖాతాలు జాయింట్ ఎల్‌పీఎంలో ఉన్నాయన్నారు. రీ సర్వే కన్నా ముందు ప్రతిరోజుకు ఉన్న 1బీలను ప్రాతిపదికన తీసుకుని పరిష్కరిస్తామన్నారు. స్పెషల్ డ్రైవ్ నిర్వహించి జాయింట్ ఎల్‌పీఎంల సమస్య పరిష్కరిస్తామన్నారు.

డిప్యుటేషన్లు రద్దు చేయాలి — ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి



ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ డీఈఓ కార్యాలయంలో చాలామంది అనేక ఏళ్లుగా డిప్యుటేషన్లపై పనిచేస్తున్నారని, తక్షణమే డిప్యుటేషన్లను రద్దు చేయాలని కోరారు. కడప బాలాజీనగర్ సబ్‌స్టేషన్ ఓవర్‌లోడ్ కారణంగా అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. మహిళా ప్రాంగణంలో కొత్త సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి విద్యుత్ స్తంభానికి ఉన్న డిష్, జియో వైర్లను తొలగించాలన్నారు. ఐటీఐ సర్కిల్ వద్ద ఉన్న జాతీయ రహదారిపై నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. ఊటుకూరు చెరువులో అక్రమంగా నిర్మించిన ఆయిల్ మిల్లు, అపార్టుమెంట్లను తక్షణమే తొలగించాలని కోరారు. కాలేటి వాగు నిర్మాణ పనులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో 80 శాతం పూర్తయ్యాయని, మిగతా పనులు పూర్తి చేయాలని చక్రాయపేట జెడ్పీటీసీ కోరారు.

- వీఎన్ పల్లె ఎంపీపీ రఘునాథరెడ్డి మాట్లాడుతూ ధరలు లేక చీనీ రైతులు నష్టపోతున్నారని తెలిపారు. పులివెందుల మార్కెట్‌యార్డులో దళారుల బెడద అధికంగా ఉందని ఆరోపించారు.

ఉల్లి రైతుల కంట కన్నీరు



ఉల్లి పంటను చూపుతున్న జెడ్పీటీసీ సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి

కమలాపురం జెడ్పీటీసీ సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఉల్లి సాగు చేసిన రైతులు ధరలు లేక కంట తడి పెట్టాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉల్లి పంటను సభలో ఆమె ప్రదర్శిస్తూ కష్టాలను వివరించారు. ఎకరాకు సుమారు 80 వేల రూపాయల ఖర్చవుతోందని తెలిపారు. మార్కెట్‌లో వ్యాపారులు క్వింటాలు రూ. 800–900లతో కొనుగోలు చేస్తుండడం వల్ల తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం క్వింటాలు రూ. 1200 ఇస్తామని చెబుతోందని, క్వింటాలు రూ. 1800–2000లతో ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మార్కెటింగ్ ఇంటర్వెన్షన్ కింద కొనుగోలు చేసి ఆదుకోవాలని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బాలయ్య కోరారు.

- బ్రహ్మంగారిమఠం ఎంపీపీ వీర నారాయణ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం చెబుతున్న ధరతో యూరియా ఎక్కడా రైతులకు అందుబాటులో లేదన్నారు. బస్తా సుమారు రూ. 500తో విక్రయిస్తున్నారన్నారు. అధిక ధరకు అడ్డుకట్ట వేయాలని కోరారు. లంచం లేకుండా నాడు-నేడు బిల్లులు చెల్లించడం లేదన్నారు.

మామిడికి బీమా ఏమైంది?



చక్రాయపేట జెడ్పీటీసీ శివప్రసాద్‌రెడ్డి

చక్రాయపేట జెడ్పీటీసీ శివప్రసాద్‌రెడ్డి, రామాపురం జెడ్పీటీసీ వెంకట రమణ, మాట్లాడుతూ గాలి, వాన కారణంగా తమ మండలాల్లో మామిడి పంట రాలిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఎకరాకు రూ. 45 వేలు బీమా వస్తుందని ప్రభుత్వం చెప్పడంతో రైతులంతా ప్రీమియం చెల్లించారని తెలిపారు. అయితే ఇంతవరకు ఒక్క రూపాయి కూడా బీమా అందలేదని చెప్పారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి బీమా అందేలా చూడాలని కోరారు. జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు కరీముల్లా మాట్లాడుతూ యూరియా ప్రభుత్వం నిర్ణయించిన ధరకు విక్రయించకపోతే రైతులు ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియజేస్తూ ఫోన్ నంబర్లు ప్రకటించాలన్నారు. జిల్లాలో రైతులు పసుపు బాగా సాగు చేసి కడప మార్కెట్‌యార్డుకు తీసుకొచ్చి విక్రయిస్తుంటారన్నారు. మార్కెట్‌యార్డులో జేయింట్ షెడ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే టాయిలెట్లు, తాగునీరు వంటి కనీస వసతులు కల్పించాలన్నారు.

కూటమి తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలి

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగ అధ్యక్షురాలు వరుదు కల్యాణి

రాజంపేట: కూటమి ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగ అధ్యక్షురాలు వరుదు కల్యాణి అన్నారు. ఆకేపాటి ఎస్టేట్‌లో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథరెడ్డి అధ్యక్షతన మహిళా కమిటీల ఎన్నిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు సంఘటితంగా ఏర్పడాలన్నారు. బూటకపు హామీలను గుప్పించి, అధికారంలోకి వచ్చాక మోసం చేసే విధంగా పాలన సాగుతోందన్నారు. అక్రమకేసులకు భయపడే ప్రసక్తిలేదన్నారు. మహిళ నేతలు ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు అన్ని మహిళా విభాగాల కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వెన్నుదున్నుగా మహిళాలోకం నిలబడాలన్నారు. 2029లో ఆయనను మళ్లీ ముఖ్యమంత్రి చేసుకునేందుకు ఇప్పటి నుంచి ముందుకుసాగాలన్నారు. అవసరమైతే శాంతియుత పోరాటాలను చేయాల్సి వస్తుందన్నారు. కమిటీలో నియమితులైన మహిళా నేతలు నిరంతరం మహిళలను చైతన్య వంతులు చేసేందుకు కృషిచేయాలన్నారు.



ఎమ్మెల్యే ఆకేపాటితో కలిసి మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు వరుదు కల్యాణి

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి మాట్లాడుతూ మహిళలు ఐక్యంగా ముందుకుసాగాలన్నారు. రాష్ట్ర అధ్యక్షులు వరుదుకల్యాణి నేతృత్వంలో రాష్ట్ర మహిళా విభాగం బలోపేతం దిశగా పయనిస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మహిళల ఆశీర్వావాదాలు ఉండేలా కృషిచేయాలని కోరారు. పార్టీ రాష్ట్ర విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాని పూజిత, రాష్ట్ర మహిళా విభాగం జోనల్ అధ్యక్షురాలు మొయిళ్ల గౌరిరెడ్డి, అనిశారెడ్డి, ఏకుల రాజేశ్వరరెడ్డి, గౌరీ, మిరియాలసురేఖ, మమత తదితరులు పాల్గొన్నారు.
- వరుదు కల్యాణిని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి ఘనంగా సన్మానించారు.

మద్యం సిండికేట్!

- ఒక్కోబార్‌కు పరిమితికి నాలుగు దరఖాస్తులు రావాలంటే అన్నీ వచ్చినట్లు లెక్క
- అనుకున్న వారే వేశారు.. వారే దక్కించుకున్నారు
- టీడీపీ ఆగడాలు, బెదిరింపులులతో చాలామంది వెనుకడుగు
- పలు షాపులకు లక్కీ డ్రా తీసిన జిల్లా కలెక్టర్



లక్కీ డిప్ తీస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్



సాక్షి రాయచోటి: కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బరితెగింపులు, దౌర్జన్యాలు, దాడులు, ఆగడాలు పెరిగిపోయాయి. ఎక్కడ ఏం చేయాలన్నా భయపడే పరిస్థితి నెలకొంటుండగా, మరొకవైపు టీడీపీ నేతలు ఇష్టానుసారంగా ఆర్థిక వనరులపై దృష్టి పెట్టారు. ఎక్కడ అవకాశం ఉన్నా నయానో, భయానో చేజిక్కించుకునేందుకు అన్ని అస్త్రాలు ప్రయోగిస్తున్నారు. ఇప్పటికే బ్రాందీ షాపులకు సంబంధించి ఎవరూ టెండర్లు వేయకుండా అడ్డుపడిన కూటమి నేతలు మరొకమారు బార్ల విషయంలోనూ అదే పంథా కొనసాగిస్తున్నారు. మద్యానికి సంబంధించి సిండికేట్‌గా మారి బార్లను చేజిక్కించుకోవడంతోపాటు ఎవరూ టెండర్ల వైపు వెళ్లకుండా చూసుకోవడం కొసమెరుపు.

- జిల్లాలో 11 ఓపెన్ బార్లు, ఒక రిజర్వుడ్ బార్‌కు సంబంధించి టెండర్లను ఆహ్వానించారు. అయితే వారం రోజులు అవకాశం ఇచ్చినా దరఖాస్తుకు ఎవరూ ముందుకు రాలేదు. రాయచోటిలో 1 బార్‌కు నలుగురు, మరొక బార్‌కు సంబంధించి నలుగురు దరఖాస్తు చేసుకోగా, రిజర్వుడు కేటగిరీ కింద వచ్చిన బార్‌కు సంబంధించి ఐదు దరఖాస్తులు, రాజంపేటలోనూ ఒక బార్‌కు నలుగురు, మదనపల్లెలో ఒక్కో బార్‌కు సంబంధించి ఐదుగురు దరఖాస్తుచేశారు. అయితే ప్రభుత్వ నిబంధనల మేరకు ఒక బార్‌కు నలుగురు దరఖాస్తు చేస్తేనే లాటరీ ద్వారా డిప్ తీసి ఖరారు చేస్తారు. ప్రతి దానికి కరెక్టుగా నలుగురే వేయడం చూస్తే సిండికేట్ కాకుండా మరేమిటన్న ప్రశ్న ఉదయిస్తోంది. భారీగా రావాల్సిన దరఖాస్తులు కేవలం లక్కీ డిప్ తీసేందుకు అవసరమైన మేరకే రావడం సిండికేట్ వ్యవహారాన్ని బలపరుస్తోంది. ఇప్పటికే కూటమి సర్కార్ విచ్చలవిడిగా మద్యం షాపులతోపాటు బెల్ట్ షాపులను తెరిచి ప్రజలకు నిత్యం మద్యం లభించేలా చర్యలు చేపట్టారు.

ఇది కాదా సిండికేట్?

కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇది, అది అంటూ ఏమి లేదు. ఏదైనా సాధ్యమేనని ఇట్టే తెలిసిపోతోంది. అందులో భాగంగా 11 ఓపెన్ బార్లతోపాటు మరో రిజర్వుడు కేటగిరి కింద బార్‌కు సంబంధించి దరఖాస్తులను ఆహ్వానిస్తే ఒక్కో బార్‌కు నలుగురు, మరో బార్‌కు ఐదుగురు మాత్రమే దరఖాస్తుచేశారు. కూటమి నేతలు భయపెట్టారో...లేక వేయవద్దని చెప్పారో తెలియదుగానీ దరఖాస్తుకు చాలామంది వెనుకంజ వేశారు. ఉన్న వాళ్లలో వాళ్లే మాట్లాడుకుని నలుగురు కలిపి బార్లకు దరఖాస్తు చేయడం ఎవరికి వచ్చినా అందరూ కలిసి మెలిసి చేసుకునేలా పథక రచన చేసినట్లు తెలుస్తోంది. కూటమి సర్కార్ హయాంలో మద్యం సిండికేట్‌గా మారి బార్లను దక్కించుకుంటున్నారు.

లక్కీడిప్‌కు అర్హత సాధించని నాలుగు బార్లు

కూటమి సర్కార్‌లోని పెద్దలు భయపెట్టారో, లేక దరఖాస్తు చేయవద్దని చెప్పారోగానీ పలు బార్లకు లక్కీడిప్‌కు అవసరమైన దరఖాస్తులు రాలేదు. మదనపల్లెలో రెండు బార్లకు సంబంధించి ఒక్కో దరఖాస్తు రాగా, పీలేరులో ఒక బార్‌కు సంబంధించి రెండు దరఖాస్తులు, రాయచోటిలో ఒక బార్‌కు సంబంధించి ఒక దరఖాస్తు మాత్రమే రావడంతో వాటిని పరిగణలోకి తీసుకోలేదు. సాధారణంగా నాలుగు దరఖాస్తులు వస్తేనే లక్కీ డిప్ వేయడానికి అర్హత సాధించినట్లు ప్రభుత్వ లెక్క. అయితే దరఖాస్తులు రాకపోవడంతో వాటిని డిప్ తీయలేదు. అయితే మరొకసారి వాటికి సంబంధించి దరఖాస్తులను ఆహ్వానించే అవకాశం ఉంది.

లాటరీ ద్వారా బార్లు కేటాయింపు: కలెక్టర్

జిల్లా వ్యాప్తంగా 11 ఓపెన్ బార్లకు, ఒక రిజర్వ్‌డ్ బార్‌కు లాటరీ ద్వారా కేటాయింపు జరిపామని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. మదనపల్లె డివిజన్‌లో మూడు , రాయచోటిలో రెండు , రాజంపేటలో రెండు, కల్లుగీత కార్మికులకు ఒక రిజర్వ్‌డ్ బార్ సహా మొత్తం 11 ఓపెన్ బార్లకు, ఒక రిజర్వ్‌డ్ బార్‌కు లాటరీ ద్వారా కేటాయించామని వివరించారు. మదనపల్లెలో ఎ.రాజన్న, బి. మనోహర్, బి.నాగరాజులు, రాయచోటిలో దొండ్ల హర్షవర్ధన్, పేరం ఐరగం రెడ్డి, రాజంపేటలో కె.సురేష్ కుమార్ నాయుడు, కె. సుబ్బయ్యలు, అలాగే కల్లుగీత కార్మికులకు రిజర్వ్‌డ్ బార్ కేటాయింపులో బి.కొత్తకోట బార్‌ను కె.ఆదిత్యకు లాటరీ డ్రా ద్వారా కేటాయించామని కలెక్టర్ తెలిపారు. మిగిలిన నాలుగు బార్లకు తగినన్ని దరఖాస్తులు రాకపోవడంతో లాటరీ నిర్వహించలేదని ఆయన స్పష్టం చేశారు.



గణేషా..నమోనమామి

మూడు రోజుల పాటు విశేష పూజలు అందుకున్న గణనాథుడు శనివారం గంగమ్మ ఒడికి చేరాడు. జిల్లా వ్యాప్తంగా 823 విగ్రహాలను ప్రజలు ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు. గణపతి బప్పా మోరియా.. గణేశ్ మహరాజ్‌కి జై.. అంటూ నినాదాలు చేశారు. జిల్లాలోని రాయచోటి, మదనపల్లె పీలేరు, తంబళ్లపల్లి, రాజంపేట, కోడూరు నియోజకవర్గ పరిధిలోని పట్టణాలు, పల్లె ప్రాంతాల్లో ప్రతిష్టించిన వినాయక విగ్రహాలను నిర్వాహకులు భక్తిశ్రద్ధలతో నిమజ్జనానికి తరలించారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆదివారం జిల్లాలో మరో 1500 విగ్రహాలు గంగమ్మ ఒడికి చేరే అవకాశాలు ఉన్నాయని పోలీసులు తెలిపారు. – రాయచోటి

చెన్నముక్కపల్లె శివాలయం వద్ద కొలువుతీరిన వినాయకుడు

వ్యాపారుల సిండికేటు.. రైతులకు చేటు

- వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలు తగ్గించడంతో బొప్పాయి రైతుల ఆందోళన
- ఆత్మహత్యలే శరణ్యమంటూ ఆవేదన
- అధికారులు స్పందించాలని వేడుకోలు



గిట్టుబాటు ధర లేక కోతకు వచ్చిన బొప్పాయి పంటను వదిలేసిన రైతు



ఆత్మహత్య చేసుకుంటామంటున్న బొప్పాయి రైతులు

ఓబులవారిపల్లె : ఉత్తర భారతదేశానికి చెందిన సేట్లు సిండికేట్ కావడంతో ఉద్యాన పంటలకు పేరు గాంచిన రైల్వేకోడూరు ప్రాంతం రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వారు నిర్ణయించిన ధరకే రైతులు తమ పంటను అమ్ముకోవాలి. ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర రాకపోవడంతో బొప్పాయి రైతుకు కష్టాలు, నష్టాలు తప్పడం లేదు. మద్దతు ధర లేకపోవడంతో ఆత్మహత్యలే శరణ్యమని రైతులు వాపోతున్నారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు..

బొప్పాయి రైతులు ధరలు లేక ఇబ్బందులు పడుతున్నారని, న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌ను రైతులు కోరగా ఆగస్టు ఒకటో తేదీ జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్, టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి సేట్‌తో అనంతరాజుపేట వైఎస్సార్ ఉద్యాన కళాశాలలో సమావేశం నిర్వహించారు. ఐదో తేదీ వరకు రూ. 9లు, ఆరో తేదీ నుంచి పది రూపాయలు కనీస ధర అమలు చేయాలని ఆదేశించారు. ఆ ఆదేశాల మేరకు కొన్ని రోజుల పాటు తొమ్మిది రూపాయలతో అమ్మకాలు జరిగాయి. ఆ తర్వాత ఒక్కసారిగా ధర రూ. 5కు తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు. అధికారులు కూడా కలెక్టర్ ఆదేశాలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారు.

సిండికేట్‌తో దగా పడుతున్న రైతు..

ఉత్తర భారతదేశంలో భారీ వర్షాలు తదితర కారణాలు నెపంగా చూపి సేట్ వ్యాపారులు సిండికేట్ కావడంతో బొప్పాయి ధర కిలో ఐదు రూపాయలుగా నిర్ణయించారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు కనీస మద్దతు ధర లేకపోవడంతో బొప్పాయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

ఆత్మహత్యలే శరణ్యం..

రైల్వేకోడూరు, రాజంపేట నియోజకవర్గాల్లో దాదాపు 7300 ఎకరాల్లో బొప్పాయి సాగులో ఉంది. ఎకరాకు సాగు చేయడానికి రూ. 70 వేలు నుంచి రూ. 80 వేలు ఖర్చు వస్తుంది. ప్రకృతి వైపరీత్యాలు, చీడపీడల బాధలు అన్నింటినీ తప్పించుకున్న రైతు పంట కోత కోసే సమయానికి సేట్ వ్యాపారులు సిండికేట్‌గా మారి వారి కష్టాన్ని దోచుకుంటున్నారు. ఎంత కష్టపడినా, అప్పులు చేసి పంటలు పండించినా రైతులకు నష్టాలు వస్తుండటంతో ఆత్మహత్యలే శరణ్యమని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం ఉత్తర భారత సేట్ వ్యాపారులను, దళారులను నియంత్రించి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో శనివారం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ధరలు కల్పించకపోతే చనిపోతామని చిట్వేలి బొప్పాయి రైతులు బహిరంగంగా అధికారులకు వీడియో ద్వారా సామాజిక మాధ్యమాలలో తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, జిల్లా కలెక్టర్ స్పందించి బొప్పాయి రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉంది.

చరిత్రలో ఎప్పుడూ ఇలాంటి ధర లేదు..



ఇటీవల కాలంలో బొప్పాయి ఇంత తక్కువగా ఎప్పుడూ అమ్ముడు పోలేదు. ఐదు రూపాయలు ధర నిర్ణయించడం ఏమిటి. దళారులు మా లాంటి రైతులను దోచుకోవడానికి చేస్తున్న కుట్ర. పట్టించుకునే వారు ఎవరూ లేరా. కలెక్టర్ ఆదేశాలు అమలు చేయరా.. ఇక మా పరిస్థితి ఏమిటి. సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి.

టంగుటూరి కృష్ణారెడ్డి, బొప్పాయి రైతు, గాడివారిపల్లి, ఓబులవారిపల్లి

కలెక్టర్ ఆదేశాల అమలులో విఫలం..



బొప్పాయి ధర కనీసం రూ. 10లుగా జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ ఆదేశించగా దళారులు, వ్యాపారులు సిండికేట్‌గా మారి ఐదు రూపాయలు నిర్ణయించడం ఏమిటి. జిల్లా కలెక్టర్ స్పందించి వ్యాపారులపై కేసులు నమోదు చేయాలి. దళారీ వ్యవస్థను రద్దు చేసి లైసెన్సు వ్యాపారాన్ని ప్రారంభించాలి.

సీహెచ్ చంద్రశేఖర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు

క్లుప్తంగా

యువతికి పాముకాటు



చికిత్స పొందుతున్న అంజుమ్

రామసముద్రం : పాడి ఆవులకు మేత వేసేందుకు వెళ్లిన యువతిని విష సర్పం కాటేసిన సంఘటన శనివారం రామసముద్రం మండలంలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. చెంబకూరుకు చెందిన టి. బాబు కూతురు టి. అంజుమ్ (19) ఇంటికి సమీపంలోని పొలం వద్ద ఉన్న పాడి ఆవులకు మేత వేసేందుకు వెళ్లింది. అక్కడ గడ్డి మధ్యన ఉన్న ఓ విష సర్పం ఆమె కాలిపై కాటేయడంతో తీవ్ర అస్వస్థతకు గురైంది. కుటుంబీకులు గమనించి బాధితురాలిని చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వ్యక్తిపై కత్తితో దాడి

మదనపల్లె రూరల్ : వ్యక్తిగత కక్షలతో ఓ వ్యక్తి మరో వ్యక్తిపై కత్తితో దాడికి పాల్పడిన ఘటన శుక్రవారం రాత్రి మదనపల్లెలో జరిగింది. బెంగళూరురోడ్డు కాలనీగేటులో నివాసం ఉంటున్న బాబు(29) స్థానికంగా మటన్ మార్కెట్‌లో పనిచేస్తుంటాడు. శుక్రవారం రాత్రి అదే ప్రాంతంలోని పుట్టింటిలో ఉన్న భార్య రాణి వద్దకు వెళుతుండగా, స్థానికుడైన గోవిందు, బాబును అడ్డగించి వ్యక్తిగత కక్షతో కత్తితో దాడికి పాల్పడ్డాడు. దాడిలో గాయపడిన బాబు స్థానికుల సహాయంతో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స తీసుకుని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

డాన్స్ మాస్టర్‌పై దాడి

మదనపల్లె రూరల్ : వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన డాన్స్ ప్రోగ్రామ్‌లో మాస్టర్‌పై కొందరు దాడిచేసిన ఘటన శుక్రవారం రాత్రి మదనపల్లెలో జరిగింది. బసినికొండకు చెందిన గౌతమ్(35) డాన్స్ మాస్టర్‌గా ప్రోగ్రామ్‌లకు వెళుతుంటాడు. ఇందులో భాగంగా సీటీఎంలో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం వద్ద శుక్రవారం రాత్రి బృందంతో కలిసి డాన్సులు వేసేందుకు వెళ్లాడు. స్టేజిపై గౌతమ్ డాన్స్ చేస్తుండగా, అక్కడే ఉన్న ఓ యువతి డాన్స్ వేసేందుకు స్టేజీ ఎక్కింది. డాన్స్ చేసే క్రమంలో యువతిని గౌతమ్ తాకడాన్ని సహించలేని యువతి బంధువులు డాన్స్‌మాస్టర్ గౌతమ్‌పై దాడికి పాల్పడ్డారు. దాడిలో గాయపడిన బాధితుడిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి స్థానికులు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

లక్కిరెడ్డిపల్లె : మండలంలోని రాయచోటి వేంపల్లి మార్గమధ్యమంలోని ఎగువపల్లె సమీపంలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో లక్కిరెడ్డిపల్లి మండలం దిన్నెపాడు గ్రామం వసంత హరిజనవాడకు చెందిన ఓబులేసు తీవ్రంగా గాయపడినట్లు స్థానికులు తెలిపారు. రాయచోటి లో పని నిమిత్తం లక్కిరెడ్డిపల్లెకు ద్విచక్ర వాహనంలో వెళుతుండగా ఏకిలపల్లి వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి కిందపడడంతో గాయపడ్డాడు. 108 కు సమాచారం అందించి రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కుక్క అడ్డు రావడంతో.. ట్రైనీ ఎస్‌ఐకి తీవ్ర గాయాలు

చాపాడు : మైదుకూరు – ప్రొద్దుటూరు జాతీయ రహదారిలోని చాపాడు సమీపంలో గల శ్రీ కాశినాయన వృద్ధాశ్రమం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రైనీ ఎస్ఐ జగదీశ్వర్‌రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. బద్వేలులో ట్రైనీ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న జగదీశ్వర్‌రెడ్డి బైక్‌లో ప్రొద్దుటూరు వెళుతుండగా కాశినాయన వృద్ధాశ్రమం దగ్గర రోడ్డుపై కుక్క అడ్డు రావడంతో బైక్ పై నుంచి కింద పడ్డారు. తీవ్ర గాయాలైన ట్రైనీ ఎస్ఐ ప్రొద్దుటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

అన్నదమ్ములపై హత్యాయత్నం



బాధితులను 108 వాహనంలో తరలిస్తున్న దృశ్యం

మదనపల్లె రూరల్/ములకలచెరువు : ఆస్తి తగాదాల కారణంగా వ్యక్తిగత కక్షలతో అన్నదమ్ములపై ప్రత్యర్థులు హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శనివారం ములకలచెరువు మండలంలో జరిగింది. బాధితులు తెలిపిన వివరాలు...బురకాయలకోటకు చెందిన రామచంద్ర, హరికుమార్, భారతీయుడు అన్నదమ్ములు. వీరికి కురబలకోట మండలం ముదివేడుకు చెందిన బంధువులు భాస్కర్, గంగాద్రి, భవానీప్రసాద్‌కు మధ్య భూతగాదాలు ఏర్పడ్డాయి. కోర్టులో హరికుమార్‌కు అనుకూలంగా భూమికి సంబంధించి తీర్పులు వచ్చాయి. దీంతో భూమి తమకు దక్కదని భావించిన భాస్కర్, గంగాద్రి, భవానీప్రసాద్‌లు కక్ష పెంచుకుని మరి కొందరితో కలిసి శనివారం తెల్లవారుజామున బురకాయలకోటకు వెళ్లి నిద్రిస్తున్న అన్నదమ్ములు రామచంద్ర, హరికుమార్, భారతీయుడుపై కర్రలు, ఆయుధాలతో మూకుమ్మడిగా దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. దాడిలో తీవ్రంగా గాయపడిన బాధితులను 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ములకలచెరువు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో బాధితులను సీపీఐ నాయకులు కృష్ణప్ప, మురళీ పరామర్శించారు. నిందితులపై కిడ్నాప్, హత్యాయత్నం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కుక్కల దాడిలో 15 గొర్రె పిల్లలు మృతి

తొండూరు : మండలంలోని అగడూరు గ్రామానికి చెందిన వెంకటశివారెడ్డి అనే గొర్రెల కాపరికి సంబంధించిన గొర్రెల మందపై కుక్కలు దాడి చేయడంతో 15 గొర్రె పిల్లలు మృతి చెందాయి. శనివారం ఉదయం గొర్రెల కాపరి శివారెడ్డి గొర్రెల మంద వద్ద నుంచి ఇంటికి వెళ్లగా, కుక్కలు గొర్రెల మందపై దాడి చేశాయి. 15 గొర్రెలు, గొర్రె పిల్లలు మృతి చెందగా, 10 గొర్రెలకు గాయాలైనట్లు బాధితుడు వాపోయాడు. దాదాపు రూ.2లక్షల మేర నష్టం జరిగినట్లు గొర్రెల కాపరి తెలిపారు.

ఐజేయూలో ఇరువురికి చోటు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ)లో వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన ఇరువురికి చోటు లభించింది. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీ కడపకు చెందిన జేసీఎస్ ప్రతినిధి రామాంజనేయరెడ్డి, మున్సిఫ్ టీవీ ప్రతినిధి సర్దార్‌కు అవకాశం కల్పిస్తూ నిర్ణయించింది. ఐజేయూలో ప్రాతినిధ్యం కోసం జిల్లా కమిటీ చేసిన సిఫార్సును రాష్ట్ర కమిటీ ఆమోదించి శనివారం అధికారికంగా ప్రకటించింది. జిల్లాకు చెందిన ఇరువురి ఎంపిక పట్ల ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఎం.బాలకృష్ణారెడ్డి, జనరల్ సెక్రెటరీ శ్రీనివాసులు, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ వెంకటరెడ్డి, రాష్ట్ర నాయకుడు రామసుబ్బారెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

ప్రశాంతంగా కొనసాగుతున్న గణేష్ నిమజ్జనాలు

కడప అర్బన్ : జిల్లాలో గణేష్ నిమజ్జనాల కార్యక్రమాలకు ఎస్పీ ఈ.జీ.అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు పోలీసులు పటిష్ట బందోబస్తు చర్యలను చేపట్టారు. ఊరేగింపు, నిమజ్జనం కార్యక్రమాల్లో ఎలాంటి చిన్నపాటి ఘటనలు, అపశ్రుతులకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఊరేగింపు, నిమజ్జన ప్రదేశాలలో ప్రత్యేకంగా అత్యాధునిక సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిఘా ఉంచారు.

సిద్దయ్య సేవలు అభినందనీయం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప జోన్‌లో డిప్యూటీ సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన పీడీ సిద్దయ్య అందించిన సేవలు అభినందనీయమని డిప్యూటీ సీపీఎం గజలక్ష్మి, డిప్యూటీ సీటీఎం (ఓఅండ్‌సీ)ప్రశాంతి కొనియాడారు. శనివారం ఆర్టీసీ ఆర్‌ఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో సిద్దయ్యకు ఆర్టీసీ అధికారులు వీడ్కోలు సభ నిర్వహించారు. అనంతరం ఘనంగా సత్కరించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



ప్రమాదంలో నుజ్జయిన కారు

సంబేపల్లె : మండల పరిధిలోని చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై శనివారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. పోలీసుల వివరాల మేరకు మండల పరిధిలోని చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై మోటకట్ల సమీపంలోని ఓ హోటల్ సమీపంలో బొలేరో పికప్ వాహనం పాత సామాన్ల లోడుతో రాయచోటి వెళుతుండగా టైర్ పంచర్ అయింది. ఈ క్రమంలోనే కలకడ వైపు నుంచి వస్తున్న కారు ఆగి వున్న బొలేరో పికప్ వాహనాన్ని అదుపు తప్పి ఢీ కొంది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న పలువురు స్వల్ప గాయాలతో బయట పడ్డారు.

రిషికొండపై ఉద్దేశపూర్వకంగా విష ప్రచారం



సమావేశంలో మాట్లాడుతున్న నాగార్జున రెడ్డి

కడప కార్పొరేషన్ : విశాఖపట్నంలోని రిషికొండపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఉద్దేశపూర్వకంగా విషం చిమ్ముతున్నారని వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు నాగార్జునరెడ్డి ఆరోపించారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రిషికొండపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వరల్డ్ క్లాస్ బిల్డింగ్స్ నిర్మించారని, ఆ భవనాల నైపుణ్యంపై చంద్రబాబే ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారన్నారు. తాజాగా ఆ భవనాల్లో సేనానితో సేన ఒక సమ్మిట్ ఏర్పాటు చేసుకొని ఆ హాల్‌లో ఒక ఫాల్ సీలింగ్ ఊడిపడిన దాన్ని పట్టుకొని విష ప్రచారానికి తెరతీశారన్నారు. ఇది ఉద్దేశపూర్వకంగా చేసినట్లుందే తప్పా వాటర్ లీకేజీ వల్ల పొడై పడినట్లు లేదన్నారు. ఈ భవనాలు కట్టడం వల్ల రూ.400 కోట్లు వృథా అయ్యాయని చూపించబోయి బొక్కబోర్లా పడ్డారన్నారు. ఈ భవ నాలపై రూ.750 కోట్లు రుణం తీసుకోవాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కూటమి ప్రభుత్వంలాగా వృథా ఖర్చులు చేయలేదన్నారు. యోగాంధ్ర పేరుతో ఈ ప్రభుత్వం రూ.400కోట్లు ఖర్చు చేసి కాళ్లు లేనివారికి, చిన్నపిల్లలకు, చనిపోయిన వారికి సైతం యోగా చేసినట్లు సర్టిఫికెట్లు ఇచ్చిందని ఎద్దేవా చేశారు. సుగాలి ప్రీతి వ్యవహారాన్ని పవన్ కళ్యాణ్ రాజకీయంగా వాడుకున్నారే తప్పా వారికి ఎలాంటి న్యాయం చేయలేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారి కుటుంబానికి 5 ఎకరాల భూమి, ఐదు సెంట్ల స్థలం, తల్లిదండ్రులిద్దరికీ ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పించారని గుర్తుచేశారు. వైఎస్సార్‌టీయూసీ నగర అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ మహానాడు సందర్భంగా సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

క్లస్టర్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి



డీఈఓకు వినతిపత్రం సమర్పిస్తున్న ఎస్టీయూ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉపాధ్యాయ బదిలీలలో సర్‌ప్లస్‌గా ఉన్న స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్, గణితంతోపాటు భాషా పండితుల పోస్టుల్లో క్లస్టర్ టీచర్లుగా నియమితులైన వారికి డీఎస్సీ 2025 నియామకాల కంటే ముందుగా రెగ్యులర్ స్థానాలను కేటాయించాలని ఎస్.టీ.యు జిల్లా అధ్యక్షుడు ఇలియాస్ బాషా, రాష్ట్ర సంయుక్త అధ్యక్షుడు కె.సురేష్ బాబు, రాష్ట్ర కౌన్సిలర్ చెన్నకేశవరెడ్డి కోరారు. ఈ విషయమై శనివారం జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీఎస్సీ 2025 నియామకాల కంటే ముందుగా జూన్, జూలై, ఆగస్టు నెలల్లో పదవీ విరమణ స్థానాలను, డీఎస్సీ 2025లో చూపించనున్న ఖాళీలలో ఈ క్లస్టర్ టీచర్లకు రెగ్యులర్ స్థానాలను కేటాయించి వారికి న్యాయం చేయాలని కోరారు.

ఏసీఏ సౌత్‌జోన్ అండర్–23 మల్టీడే మ్యాచ్‌లు ప్రారంభం



109 పరుగులు చేసిన చిత్తూరు బ్యాట్స్‌మన్ జెనిక్ దాస్



84 పరుగులు చేసిన చిత్తూరు బ్యాట్స్‌మన్ రెడ్డి రుషిల్



54 పరుగులు చేసిన చిత్తూరు బ్యాట్స్‌మన్ బీఎం వెంకటేష్



166 పరుగులు చేసిన నెల్లూరు బ్యాట్స్‌మన్ సోహన్ వర్మ



79 పరుగులు చేసిన నెల్లూరు బ్యాట్స్‌మన్ పవన్ రిత్విక్

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ఏసీఏ సౌత్‌జోన్ అండర్–23 మల్టీ డే మ్యాచ్‌లు ప్రారంభమయ్యాయి. శనివారం కేఎస్‌ఆర్‌ఎం క్రికెట్ మైదానంలో తొలి రోజు కడప–చిత్తూరు జట్లు తలపడ్డాయి. ముందుగా టాస్ గెలిచిన కడప జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు 90 ఓవర్లకు 3 వికెట్లు కోల్పోయి 346 పరుగులు చేసింది. ఆ జట్టులోని జెనిక్ దాస్ 197 బంతుల్లో 12 ఫోర్లు, 2 సిక్సర్లతో 109 పరుగులు, రెడ్డి రుషిల్ 142 బంతుల్లో 84 పరుగులు, తేజ రెడ్డి 64 బంతుల్లో 60 పరుగులు, బీఎం వెంకటేష్ 92 బంతుల్లో 54 పరుగులు చేశాడు. కడప జట్టులోని ఎస్‌ఎండీ అస్లామ్ 2 వికెట్లు తీశాడు. దీంతో తొలి రోజు ఆట ముగిసింది.

వైఎస్‌ఆర్‌ఆర్ ఏసీఏ క్రికెట్ స్టేడియంలో..

వైఎస్‌ఆర్‌ఆర్ క్రికెట్ స్టేడియంలో జరిగిన మరో మ్యాచ్‌లో తొలి రోజు నెల్లూరు–కర్నూలు జట్లు తలపడ్డాయి. ముందుగా టాస్ గెలిచిన నెల్లూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 82 ఓవర్లకు 6 వికెట్లు కోల్పోయి 374 పరుగులు చేసింది. ఆ జట్టులోని ఎస్. సోహన్ వర్మ 209 బంతుల్లో 13 ఫోర్లు, 3 సిక్సర్లతో 166 పరుగులు చేసి అద్భుతంగా ఆడాడు. పవన్ రిత్విక్ 79 పరుగులు, మాధవ్ 43 పరుగులు చేశారు. కర్నూలు జట్టులోని అక్షిత్‌రెడ్డి 2 వికెట్లు, సాయి ప్రణవ్ చంద్ర 2 వికెట్లు తీశారు. దీంతో తొలి రోజు ఆట ముగిసింది.

ఆశా వర్కర్లకు కనీస వేతనాలు చెల్లించాలి

ఆశా వర్కర్స్ యూనియన్ జాతీయ కార్యదర్శి కె.మల్లిక



కడపలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆశా వర్కర్లు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ఆశా కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనాలు అమలు చేయాలని అఖిల భారత ఆశా వర్కర్స్ యూనియన్ జాతీయ కార్యదర్శి కె.మల్లిక కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మూడో మహాసభల సందర్భంగా కడపలో భారీ ప్రదర్శన, సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తూ విశేషమైన సేవలు అందిస్తున్న ఆశా కార్యకర్తలను ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కరోనా కష్టకాలంలో ప్రజలకు సేవలు అందించిన ఆశా కార్యకర్తలకు ప్రపంచ ఆరోగ్య సంస్థ గ్లోబల్ హెల్త్ లీడర్స్ అని బిరుదు ఇచ్చిందే తప్ప వారికి వేతనాలు పెంచాలని ప్రభుత్వాలు ఆలోచించకపోవడం శోచనీయమన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తక్షణం ఆశాల వేతనాలు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని చెప్పి ఓట్లు దండుకున్న తర్వాత ఆశాలను మర్చిపోవడం సరి కాదన్నారు. డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎస్.వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ఆశాలకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ సభలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్.నాగసుబ్బారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బరాయుడు, ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాహుల్. శాంతి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్, ఏఐటీయూసీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు గంగాధర్, జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరి కె.సి. బాదుల్లా, ఆశా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. కల్పన తదితరులు పాల్గొన్నారు.

చిన్న రైతుకు రాయితీ ఫలం!

- నూరు శాతం రాయితీతో 23 రకాల పండ్ల మొక్కల సాగు
- రోజా, మల్లె మొక్కలకూ అవకాశం
- మూడేళ్ల పాటు సంరక్షణకు ఆర్థిక సాయం
- నాలుగు వేల ఎకరాల్లో మొక్కలు నాటేలా లక్ష్యం



సింహాద్రిపురంలో గుంతలు తీసే పనిలో కూలీలు

కడప సిటీ : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని చిన్న, సన్నకారు రైతులకు మామిడి, జీడి మామిడి, చీనీ, సన్ననిమ్మ, జామ, తైవాన్ జామ, సపోట, కొబ్బరి, నేరేడు, చింత, సీతాఫలం, దానిమ్మ, అంజురా, డ్రాగన్ ఫ్రూట్, జాఫ్రా, అవకాడో, సిల్వర్ ఓక్, పనస, ఆయిల్ ఫాం, కోకో, రబ్బర్ ప్లాంటేషన్, ఆపిల్ బేర్‌తోపాటు మునగ, మల్లె, రోజా పూల తోటలు, పండ్ల తోటల పెంపకానికి అవకాశం ఉంది.

తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు

ఈ పండ్ల తోటల పెంపకంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు ఆర్జించే అవకాశం కల్పిస్తున్నారు. రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా వారికి ఒక సుస్థిర ఆదాయ మార్గం ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంతో ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డులు కలిగి 25 సెంట్ల నుంచి ఐదు ఎకరాల భూమి కలిగిన రైతులు ఈ పథకం ద్వారా వంద శాతం సబ్సిడీతో లబ్ధి పొందేందుకు అవకాశాలు ఉన్నాయి. అంతకంటే ఎక్కువ భూమి కలిగిన రైతులకు ఉద్యానశాఖ ద్వారా 30 శాతం వరకు ఆర్థిక సబ్సిడీతో ప్లాంటేషన్ చేసుకునేందుకు కూడా అవకాశం ఉంది.

నీటి వసతి లేకున్నా..

ఈ తోటల ద్వారా ఆర్థిక స్థిరత్వం పొందే విధంగా రైతులకు అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వం కల్పిస్తోంది. నీటి వసతి లేకపోయినా దగ్గరలోని వాగులు, వంకలు, చెరువుల నుంచి నీళ్లను ట్యాంకర్ల సాయంతో తెచ్చుకుని మొక్కలను సంరక్షించుకునేందుకు నీటి తడులకు కూడా ప్రభుత్వం ఆర్థికసాయం అందించి రైతులకు ఒక సుస్థిర ఆదాయ మార్గాన్ని కల్పించేందుకు వీలు కల్పించింది.

నాలుగు వేల ఎకరాల్లో నాటేందుకు లక్ష్యం

జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో నాలుగు వేల ఎకరాల్లో పండ్ల తోటల పెంపకానికి లక్ష్యంగా ఎంచుకున్నారు. ఇప్పటివరకు 2500 ఎకరాలకు రైతులను గుర్తించారు. ఇందులో 1100 ఎకరాల్లో రైతులు మొక్కలు నాటుకున్నారు. మరో 300 ఎకరాల్లో మొక్కలు నాటేందుకు సిద్ధంగా రైతులు గుంతలు తీసి ఉన్నారు. మిగిలిన వారికి సంబంధించిన పరిపాలన అనుమతుల కోసం ప్రణాళిక సిద్ధం చేశారు. అర్హత కలిగి ఆసక్తి ఉన్న రైతులు ఎంతమంది ముందుకు వచ్చినా ఈ పథకం ద్వారా ఆర్థిక లబ్ధి చేకూర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కడప డ్వామా పీడీ ఆదిశేషా రెడ్డి తెలిపారు.

ఒక ఎకరాకు నాటే మొక్కల సంఖ్య, మూడు సంవత్సరాల నిర్వహణకుగాను లబ్ధి చేకూరే వివరాలు ఇలా ఉన్నాయి.

పండ్ల తోట రకం	మొక్కల సంఖ్య	చేకూరే లబ్ధి (ఎకరాకు)
మామిడి	70	1,09,950
జీడి మామిడి	70	98,684
చీనీ నిమ్మ	100	1,37,750
సన్న నిమ్మ	110	1,46,311
జామ	110	1,46,971
తైవాన్ జామ	444	2, 51,224
సపోట	60	95,584
కొబ్బరి	60	99,183
నేరేడు	40	68,163
చింత	40	68,403
శీతాఫలం	240	2,14,178
దానిమ్మ	267	2,16,417
అంజుర	310	1,67,324
డ్రాగన్ ఫ్రూట్ (అర ఎకరా)	900	2,00,714
జాఫ్రా	200	1,36,871
అవకాడో	70	1,16,254
సిల్వర్‌ఓక్	700	1,52,295
పనస	40	67,163
ఆయిల్‌ఫాం	60	55,771
కోకో	200	1,59,485
రబ్బరు ప్లాంటేషన్	200	1,26,186
ఆపిల్ బేర్	320	62,355
మునగ	448	1,05,952